# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 08 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఆర్టీసీలో 3038 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- త్వరలో నోటిఫికేషన్ విడుదల : ఎండీ సజ్జనార్ ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 3038 పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే దీనిపై అవసరమైన కార్యాచరణ ప్రారంభించామని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం అనేకమంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యంగా తయారీ పాఠశాలలు, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ నుంచి వచ్చిన ఈ ప్రకటన యువతలో ఆనందాన్ని నింపుతోంది. ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) లేదా ఇతర నియామక సంస్థల ద్వారా చేపట్టనున్నట్టు సజ్జనార్ తెలిపారు. ఖాళీలపై గల నిరుద్యోగుల ఆతృతకు తెరపడే అవకాశం ఉందన్నారు.ఉద్యోగాల విషయంలో మోసపూరిత ప్రచారాలకు, మభ్యపెట్టే వ్యక్తుల మాటలను నమ్మవద్దని ఆర్టీసీ ఎండీ హెచ్చరించారు. ఉద్యోగాల పేరిట డబ్బులు అడిగేవారి గురించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎంపిక పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు.

## రైతుల ప్రయోజనాలపై రాజీపడం

- ప్రధాని మోడీ
- ట్రంప్ అదనపు సుంకాలపై పరోక్షంగా స్పందించిన ప్రధాని



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అదనపు సుంకాలపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా స్పందించారు. రైతుల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యం అని, వారిపై ప్రభావం కలిగించే అంశాల్లో ఎంత మూల్యమైనా చెల్లించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లకు ఇది గట్టి కౌంటర్‌గా రాజకీయంగా చెబుతున్నారు.దిల్లీలో జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మోదీ, వ్యవసాయం, మత్స్యసంబంధిత రంగాలపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. "రైతుల ప్రయోజనాల విషయంలో ఒక్క అడుగు కూడా వెనక్కి వేయం. అవసరమైతే వ్యక్తిగతంగా తాను ఎంత మూల్యమైనా చెల్లించేందుకు సిద్ధం" అని స్పష్టం చేశారు.

రష్యా చమురు కొనుగోలుపై భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న ట్రంప్, ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. ఇందులోని ప్రథమ దశలో 25% అదనపు సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. మిగిలినవి ఈ నెల 27న అమల్లోకి రానున్నాయి.అమెరికా సుంకాల ప్రభావం భారత దేశపు కీలక ఉత్పత్తులైన రొయ్యలు, జంతు ఉత్పత్తులు, తోలు, వస్త్ర ఉత్పత్తులపై పడనుంది. ముఖ్యంగా ఎగుమతులపై ఆదాయానికి భారీ దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. అగ్రరాజ్యం భారత్ నుంచి దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. అయితే రైతులకు నష్టం వాటిల్లుతుందని భావించిన కేంద్రం దీన్ని స్పష్టంగా తిరస్కరిస్తోంది. గతంలో జరిగిన చర్చలన్నీ ఫలితవంతం కాలేదని సమాచారం.

# అన్ని ప్రయత్నాలు చేశాం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో అన్ని ప్రయత్నాలు
- కేంద్రం నుంచి సహకారం లభించలేదు
- బీసీ రిజర్వేషన్లపై ప్రధాని అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదు
- '42 శాతం'పై త్వరలో బీసీ సంఘాలు, భాగస్వాములతో భేటీ
- స్థానిక ఎన్నికలు ఆపడం వల్ల రాష్ట్రానికే నష్టం
- బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యం
- ఎర్రవల్లే కేసీఆర్‌కు చర్లపల్లి.. ప్రత్యేకంగా మేం జైల్లో పెట్టక్కర్లేదు
- ములాఖత్‌కు వెళ్లినట్టే నేతలు ఫాంహౌజ్‌కు వెళ్లొస్తున్నారు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించిన బిల్లులను తక్షణం ఆమోదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారిని మరోసారి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి గారు అపాయింట్‌మెంట్ ఇస్తే కలిసి విజ్ఞప్తి చేయడానికి ఢిల్లీ వచ్చినట్టు తెలిపారు.మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో ముఖ్యమంత్రి గారు పత్రికా సమావేశంలో మాట్లాడారు. బీసీలకు విద్య, ఉద్యోగావకాశాల్లో, అలాగే స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి శాసనసభ రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతంకంటే మించి ఉండడానికి వీలులేకుండా గతంలో చేసిన చట్టం అడ్డంకిగా మారడంతో ఆ పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందనీ, ఆ ఆర్డినెన్స్‌ను కూడా గవర్నర్ రాష్ట్రపతికి పంపించారని గుర్తు చేస్తూ ఈ మూడింటిని తక్షణం ఆమోదించాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధితో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ అన్ని ప్రయత్నాలు చేసిందని, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న కారణంగానే వారిని కలిసి విజ్ఞప్తి చేయడానికి మొత్తం మంత్రివర్గంతో పాటు ఎంపీలతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా ఢిల్లీ వచ్చినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఈ విషయంలో కేంద్రం నుంచి సహకారం లభించలేదని పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

"ఎర్రవెల్లి ఫాంహౌసే మాజీ సీఎం కేసీఆర్‌కు చర్లపల్లి జైలు. ఆయన్ని మేం ప్రత్యేకంగా జైలులో పెట్టాల్సిన పనిలేదు. చర్లపల్లి సెంట్రల్ జైలు బయటా పోలీసులు కాపలా ఉంటారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ బయటా పోలీసులు ఉంటారు. జైల్లో ఖైదీలతో ములాఖాత్‌కు వెళ్లినట్టే, అప్పుడప్పుడు ఆపార్టీ నేతలు ఫాంహౌస్‌కు వెళ్లి ఆయన్ని కలిసి వస్తుంటారు" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "కేసీఆర్ ఆస్పత్రిలో చేరారని తెలిసి పార్టీ నేతల్ని వెళ్లి చూడమన్నా. బీఆర్ఎస్ నేతలు వద్దన్నారని వారు చెప్పారు. మరి కేసీఆర్ ఆరోగ్యంలో ఏం సీక్రెట్ ఉందో నాకైతే తెలీదు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వాకబ్ చేస్తూ, ఉత్తమమైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శిని ఆదేశించాను" అని తెలిపారు. "నేను విద్వేష రాజకీయాలు చేయడం లేదు. కేసీఆర్ మాదిరి బిట్టర్ (చేదు) పాలిటిక్స్ రావు" అని స్పష్టంచేశారు.

"బీసీ రిజర్వేషన్లపై ప్రధాని అపాయింట్ మెంట్ అడిగినా ఇవ్వలేదు. ఈ విషయంలో కేంద్ర హోం శాఖతో సంబంధం లేనందున అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోరలేదు" అని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెట్టుకింద ప్లీడర్‌లా, గల్లీ లీడర్‌లా మాట్లాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులో అసలు ముస్లింల ప్రస్తావన ఎక్కడుందని సీఎం ప్రశ్నించారు. అసలు ఆ బిల్లుల్లో ఏముందో చదివారా? అని ప్రశ్నించారు. ముస్లింలు ఈ దేశంలో పౌరులు కాదా? అని నిలదీసారు. 'వెనుకబాటు, సామాజిక, ఆర్థిక ఆధారాలపై రిజర్వేషన్లు ఉంటాయి. మతపరంగా రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించలేదు. మేం మతం పేరుతో ఎక్కడా రిజర్వేషన్లు కల్పించలేదు. అసలు ఆ బిల్లుల్లో ఎక్కడా కుల, మతాల గురించి రాయలేదు. బీసీలకు 42 శాతం ఎన్ బ్లాక్‌గా రిజర్వేషన్లు కోరుతున్నాం' అని స్పష్టం చేశారు. ముస్లింలు సీఎంలు కావద్దనేలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం. మీరు ఎప్పుడొస్తారో తేదీ, వేదిక, సమయం చెప్పండి" అని సవాలు విసిరారు. ముస్లింలను రాష్ట్రపతులు, ముఖ్యమంత్రుల్ని చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు.

బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదు. వాళ్ళు చేసిన పాపాలకు 'నైతికత' కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. బీహార్ ఎన్నికలతోపాటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకూడా వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. 'పార్టీ మారడం తప్పు. పార్టీ మారితే వేటుపడుతుందని సుప్రీం తీర్పు ఇస్తే మేమే సేఫ్. మా దగ్గరున్న 65 మంది ఎమ్మెల్యేలు అలానే ఉంటారు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల

మిగితా 2వ పేజీలో

## ఎన్నికల కమిషన్ మోసం




- బీజేపీకి అనుకూలంగా ఓట్ల దొంగతనం జరిగింది
- ఎంపీ రాహుల్ గాంధీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సంఘంపై లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీతో కలిసి కుట్రపూరితంగా ఎన్నికల ఫలితాలను దారి మళ్లించారని ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోకసభ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్షా 250 నకిలీ ఓట్లు సృష్టించారని, ఇవి బీజేపీ విజయంలో కీలక పాత్ర వహించాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గత ఎన్నికల్లో జరిగిన అవకతవకలు, ఓట్ల దొంగతనం జరిగిన తీరుతెన్నులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

"ఒకే నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు. ఐదు నెలల వ్యవధిలోనే కొత్తగా కోటి ఓట్లు నమోదు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన నేరం. ఎన్నికల సంఘంతో కలిసి బీజేపీ భారీ నేరపూరిత మోసం చేసింది. బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై, వారికి సహాయం చేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఎంతో ఇష్టపడే ప్రజాస్వామ్యం ఉనికిలో లేదు. తక్షణం ఈ విషయంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలి" అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. తాము సేకరించిన ఆధారాల వంటివి దేశవ్యాప్తంగా ఉన్నాయని, అలాంటి ఆధారాలను నాశనం చేయడంలో ఎన్నికల సంఘం బిజీగా ఉందని ఘాటుగా విమర్శించారు.

"అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ వ్యక్తుల పేర్లు ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు మా అనుమానాలకు బలం చేకూర్చాయి" అని రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని అన్నారు. "మహారాష్ట్ర ఎన్నికల్లో 40 లక్షల ఓట్లు రహస్యంగా జోడించారు. ఐదేండ్లలో నమోదైన వారి కంటే, ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 2024 లోక్‌సభ, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారు. దీనికి సంబంధించిన ఓటర్ల జాబితాను మాకు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం నిరాకరించింది" అని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా గణాంకాలతో సహా వివరించారు.

కర్నాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5 లక్షల ఓట్లకు గాను లక్ష నకిలీ ఓట్లు సృష్టించారు. అవన్నీ తప్పుడు చిరునామాల్లో ఉన్నాయి. ఇవన్నీ మా పరిశీలనలో తేలాయి" అని చెప్పుకొచ్చారు. "బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ, మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను

మిగితా 2వ పేజీలో

## రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుంది




- కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి తెలంగాణ సాధించుకొచ్చారు
- మరి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్లు సాధించారా
- తెలంగాణ ఉన్నంతకాలం గులాబీ కండువా ఉంటుంది
- మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్

రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుందని, అందుకే ఢిల్లీకి వెళ్లినా కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.పరిగి నియోజకవర్గం నుంచి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను మరో 10-15 సంవత్సరాలు వెనక్కి నెడుతోందని ఆరోపించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాతే రిజర్వేషన్లు ఇస్తామని చెబుతున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి తెలంగాణ సాధించుకొచ్చారని, మరి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్లు సాధించారా అని ప్రశ్నించారు. తెలంగాణలో కరెంటు కోతలు, ఎరువుల కొరత, పల్లెల్లో సంక్షోభం, పట్టణాల్లో పాలన పడకేయడం వంటి అన్యాయాలు జరుగుతున్నాయని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోని వ్యక్తి, వర్గం ఒక్కటి కూడా లేదని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని అడిగితే రేవంత్ రెడ్డి 'నన్నేం చేసుకుంటారో చేసుకోండి' అని అంటున్నారని, ఇది డ్రామా కాక మరేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి కంటే ఎక్కువగా కాంగ్రెస్ పాట పాడుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నారని, ఈ ప్రభుత్వం మరో రెండున్నర సంవత్సరాలు మాత్రమే ఉంటుందని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు. ఆ తర్వాత ప్రతీ అధికారి లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు.

మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ చెప్పిన కట్టుకథలను ప్రజలు నమ్మి వారికి ఓటు వేశారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును రద్దు చేస్తుందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ మోసాలను అర్థం చేసుకున్నారని, అధికారులు ప్రజాహితంగా పనిచేయాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గత 10 సంవత్సరాలు తెలంగాణ అభివృద్ధిపైనే దృష్టి సారించి కార్యకర్తలకు తగినంత చేయలేకపోయామని, మళ్లీ అధికారంలోకి రాగానే కార్యకర్తలను అన్ని రకాలుగా

మిగితా 2వ పేజీలో



## చేనేతకు ప్రోత్సాహం

- రుణ మాఫీకి రూ.33 కోట్లు విడుదల
- చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్

చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేసినట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో వందకు పైగా చేనేత ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి ప్రారంభించారు. ఆగస్టు 17 వరకు ఎగ్జిబిషన్, అమ్మకాలుంటాయని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు ఎన్నికైన వారిని మంత్రిసత్కరించారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్ మడత ఆసు మిషన్‌ను ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా 'తెలంగాణ అతెంటిక్ వేవ్స్' లోగోను, త్రిలింగ పట్టు చీరలను మంత్రి ఆవిష్కరించారు. అలాగే ఎలక్ట్రానిక్ మడత ఆసు మిషన్‌ను పరిశీలించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కారాలకు ఎంపికైన వారిని మంత్రి అభినందించారు.

చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా కొనసాగుతోందని మంత్రి తుమ్మల వెల్లడించారు. రాష్ట్రం జియో ట్యాగింగ్ ప్రక్రియలోనూ ముందంజలో ఉందన్నారు. పదిరోజుల పాటు నిర్వహించనున్న చేనేత వస్త్ర ప్రదర్శన కార్మికుల ఉత్పత్తులకు వ్యాప్తిని అందిస్తుందన్నారు. వస్త్రాల తయారీలో అహర్నిశలూ శ్రమించే నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. నేతన్న భద్రత పథకం ద్వారా చనిపోయిన నేతన్న కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందిస్తోందన్నారు. చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక అని, తరం తరం నుంచి వస్తున్న హస్తకళను మనం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ చేనేత రంగం దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ పేరు తెచ్చుకుందని మంత్రి వివరించారు. గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్ షీట్స్ వంటి ఉత్పత్తులు విదేశాల్లోనూ ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారా వస్త్రాల కొనుగోలును తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తద్వారా చేనేత కార్మికుల ఉత్పత్తులకు పెద్ద మద్దతుగా మారుతుందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి) ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరానికి చేరువ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ చేనేత కళలన్నింటికీ పునర్వైభవం తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. రెండు సంవత్సరాల కాలవ్యవధితో నేతన్న పొదుపు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మరణించిన చేనేత కుటుంబానికి అండగా ఉండేలా నేతన్నకు భద్రతా పథకం ద్వారా మరణించిన కుటుంబ నామినీకి రూ.5 లక్షలు అందజేస్తున్నామన్నారు. చేనేత రుణమాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ. 6 వేలు వచ్చేలా నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించినట్టు వివరించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఐఐహెచ్‌టీని ప్రారంభించి, 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చినట్టు తెలిపారు.

## ఆకాశానికి చిల్లు



- హైదరాబాద్‌లో భారీ వర్షం
- జలమయమైన రోడ్లు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి నగర వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 12.3 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, ఖైరతాబాద్‌లో 11.13 సెం.మీ., సరూర్‌నగర్‌లో 10.6, ఉప్పల్‌లో 9.5, షేక్‌పేట్‌లో 9, ఉప్పల్ న్యూనాగోల్‌లో 8, బండ్లగూడలో 8, దిల్‌సుఖ్‌నగర్‌లో 8.2, లింగోజిగూడలో 7.6, మలక్‌పేట్ ఆస్మాన్‌గఢ్‌లో 7.6, ఉప్పల్ రామాంతపూర్‌లో 7.5, నాగోల్‌లో 7.4 బాలానగర్‌లో 7, జూబ్లీహిల్స్‌లో 6.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.ఈ భారీ వర్షానికి భాగ్యనగరం తడిసిముద్దైంది. పలు బస్తీలు, కాలనీలు, రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపైకి భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయాయి.

రోడ్లన్నీ జలమయ మయ్యాయి. లోతట్టు ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం 6గంటల తర్వాత మొదలైన వర్షం రాత్రి వరకు పడుతూనే ఉంది. భారీ వర్షానికి పలు బస్తీలు, కాలనీలు, రహదారులు చెరువులను తలపించాయి. ఒక్కసారిగా 9సెం.మీ వర్షం కురియడంతో నగర వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఎటుచూసినా రోడ్డుపై వరదనీరు ఉండడంతో రోడ్లు, ప్రధాన జంక్షన్ల వద్ద ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మ్యాన్ హెూల్స్ పొంగి పొర్లాయి. చాలాచోట్ల నాలాలు పొంగి ప్రవహించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల వాసులు భయాందోళనకు గురయ్యారు.

## మతపరమైన రిజర్వేషన్లతో అశాంతికి ప్రయత్నమా?

- కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలను తీవ్రంగా ఎద్దేవా చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో ఇండియా కూటమి నేతలు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో ఆయన తీవ్ర విమర్శలు చేశారు.గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు అమలైన 34 శాతం రిజర్వేషన్లను కేసీఆర్ ప్రభుత్వం 27 శాతానికి తగ్గించిందన్నారు. అదే సమయంలో ముస్లింలకు ప్రత్యేకంగా 12 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్రలు చేశారని మండిపడ్డారు. ఈ క్రమంలో

మిగితా 2వ పేజీలో

# రాజ్యసభలో కోస్టల్ షిప్పింగ్ బిల్లుకు ఆమోదం

- **లోకసభలో మణిపూర్ జీఎస్టీ సవరణ బిల్లు ఆమోదం**
- **నిరసనల మధ్య సభల వాయిదా**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

విపక్షాల నిరసనల మధ్య రాజ్యసభ కోస్టల్ షిప్పింగ్ బిల్-2025ను గురువారం స్వల్ప చర్చ అనంతరం ఆమోదించింది. ఇదే సమయంలో, లోకసభలో మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (సవరణ) బిల్లు-2025 చర్చ లేకుండానే ఆమోదమైంది.

బీహార్‌లో జరుగుతున్న ప్రత్యేక విస్తృత సమీక్ష అంశంపై చర్చ జరపాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. వారి శబ్ద వినిపింపజే తలతో సభల కార్యక్రమం భంగపెట్టబడింది. దీంతో, రాజ్యసభ, లోకసభలూ ఆగస్టు 8వ తేదీ ఉదయం 11 గంటల వరకు వాయిదా పడ్డాయి.

**రాజ్యసభలో నిబంధన 267 కింద వచ్చిన నోటీసులన్నీ తిరస్కరణ**

రాజ్యసభలో ఉదయం సమావేశాల్లో పత్రాలు, నివేదికల సమర్పణ అనంతరం, ఉప సభాపతి హరివంశ్ మాట్లాడుతూ నిబంధన 267 కింద సభ్యుల నుంచి 25 నోటీసులు వచ్చాయని తెలిపారు. అయితే, అవి నిబంధన ప్రమాణాలకు సరిపోవడం లేదని పేర్కొంటూ అన్నింటినీ తిరస్కరించారు.

ప్రశ్నోత్తర సమయంలో స్మార్ట్ సిటీ మిషన్కు సంబంధించిన ప్రశ్నలను సభలో ఉంచే ప్రయత్నం చేసిన స్పీకర్ ఓం బిర్లా, విపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతుండటంతో సభను తాత్కాలికంగా వాయిదా వేశారు. "ఇలా సభ సాగదు.. మీ ఉద్దేశం సభ నడవకుండా చేయడమే" అని వ్యాఖ్యానించారు.

# సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

- **అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు**
- **ఈనెల 21వరకు నామినేషన్ల దాఖలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవి ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచే అధికారికంగా మొదలైంది. సెప్టెంబర్ 9న రాష్ట్రపతి ఎన్నిక జరగనున్నదని ఈసీ వివరించింది. అదే రోజు ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు విడుదల కానున్నాయని పేర్కొన్నది. ఈసీ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఆగస్టు 21. ఆగస్టు 22న నామినేషన్ పేపర్ల పరిశీలన(స్క్రుటినీ) ఉంటుంది. నామినేషన్లను ఉపసంహరించుకోవటానికి చివరి తేదీ ఆగస్టు 25. సెప్టెంబర్ 9న ఎన్నికల నిర్వహణ ఉంటుంది. అదే రోజు ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు వెలువడుతాయి. ఆరోగ్య కారణాలతో గతనెల 21న జగదీప్ ధన్కర్ రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక అనివార్యమైన విషయం విదితమే. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మంచి ఆధిక్యం ఉన్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యసభకు నామినేట్ అయిన సభ్యులు కూడా ఓటు వేయటానికి అర్హులే. 543 మంది సభ్యులుండాల్సిన లోక్‌సభలో ప్రస్తుతం ఒక స్థానం (పశ్చిమ బెంగాల్ నుంచి బసిర్‌హట్ సీటు) ఖాళీగా ఉన్నది. 245 మంది సభ్యులుండాల్సిన రాజ్యసభలో ప్రస్తుతం ఐదు ఖాళీలు (జమ్మూకాశ్మీర్ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి ఒకటి) ఉన్నాయి. దీంతో రెండు సభల సభ్యుల మొత్తం సంఖ్య 786గా ఉన్నది. విజయం సాధించాలంటే మొత్తం 394 మంది సభ్యుల బలం అవసరం ఉంటుం దని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులు ఉన్నారు. ఇక రాజ్యసభలో అధికార కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉన్నది. దీంతో ఎన్డీఏకు పార్లమెంటు ఉభయ సభల్లో కలుపుకొని మొత్తం 422 మంది సభ్యులు ఉన్నారు.

# పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



- **ఏఐసీసీ అధ్యక్షులు, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీలకు లోకల్‌బాడీ ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలిపేలా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఏఐసీసీ అధ్యక్షులు, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులతో కలిసి గురువారం పార్లమెంట్‌లో ఖర్గేతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో కుల సర్వే తీరు, శాసనసభలో బిల్లుల ఆమోదం విషయాలను ఆయనకు వివరించారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచిన విషయాన్ని ప్రస్తావించారు. ఖర్గేను కలిసిన వారిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, గడ్డం వివేక్ వెంకట స్వామి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

# సినీకార్మికులకు వేతనాలు పెంచాలి

- **సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినీ రంగ కార్మికులకు వేతనాలను పెంచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండ్ చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్న చిత్రాలకు 15 శాతం వేతనాలను పెంచాలని కోరారు. వారికి న్యాయం జరిగేవరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని సినీ కార్మికులకు న్యాయం చేయాలని చెప్పారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహాతో కలిసి నారాయణ మాట్లాడారు. తెలుగు సినీ కార్మికులు వేతనాలు పెంచమంటే ముంబాయి నుంచి సినీ కార్మికులను తెచ్చి పని చేయించుకుంటామంటూ నిర్మాతలు బెదిరింపులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇక్కడి కార్మికులకు అన్యాయం చేస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్మికుల పక్షాన ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధమవుతామని చెప్పారు. రాష్ట్రంలో తెలుగు సినిమా రంగంలో కేవలం 10 కుటుంబాలు, థియేటర్లు నాలుగు కుటుంబాల చేతుల్లో ఉన్నాయని అన్నారు. వారే మొత్తం ఆడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సందేశాత్మక చిత్రాలకు మాత్రమే ప్రోత్సాహం అందించాలన్నారు. రూ.వందల కోట్లతో సమాజాన్ని చెడుమార్గం పట్టించేలా తీస్తున్న చిత్రాలకు ఎలాంటి పరిస్థితుల్లో రాయితీలు ఇవ్వొద్దని కోరారు. టికెట్ల పెంపునకు అనుమతులు ఇవ్వొద్దని అన్నారు. దిల్‌రాజు వంటి పెద్ద పెద్ద నిర్మాతలు, హీరోలను పిలిచి మాట్లాడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సినిమా కార్మికులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పక్షపాతం సరికాదనీ, కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. గతంలో సినీ నటుడు చిరంజీవిపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల అప్పుడే క్షమాపణలు చెప్పి ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నానని నారాయణ గుర్తు చేశారు. కానీ చిరంజీవి మళ్లీ ఆ ప్రస్తావన తేవడం, ఆ వీడియోలను వైరల్ చేయడం సరికాదన్నారు. ఈ అంశాన్ని చిరంజీవి నైతికతకు, విజ్ఞతకు వదిలేస్తున్నానని చెప్పారు.

# అన్ని ప్రయత్నాలు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

అమలుపై త్వరలోనే బీసీ సంఘాలు, బీసీ భాగస్వాములతో భేటి అవుతామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు."బీసీ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపకపోతే, పార్టీ పరంగా 42 శాతం అమలుపై పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)లో చర్చిస్తాం. ఈ విషయంలో ఇతర పార్టీలు కూడా ముందుకొస్తే సంతోషం. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని కేసీఆర్ తెచ్చిన పంచాయితీరాజ్ చట్టం వల్లే సమస్య తయారైంది" అని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లకు రాహుల్, ఖర్గే సంపూర్ణ మద్దతు ప్రకటించారని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. జంతర్‌మంతర్‌లో బీసీ రిజర్వేషన్లపై పోరుబాటకు ఖర్గే, రాహుల్ రాలేదని విపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదన్నారు. 'రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఇందిరా భవన్‌లో నాలుగు గంటల పాటు తెలంగాణ కుల సర్వే, బీసీ రిజర్వేషన్ల పెంపుపై నాలుగు గంటలు సావధానంగా విన్నారు. వంద మంది ఎంపీలకు వివరించారు. ఈ విషయంలో తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లాలని తలకటోరా స్టేడియంలో జాతీయస్థాయి సదస్సు పెట్టి వివరించాం. జార్ఖండ్ మాజీ సీఎం శిబుసోరెన్ అంత్యక్రియలు, వారి కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు రాహుల్ అక్కడికి వెళ్లారని తెలిపారు.

# మతపరమైన రిజర్వేషన్లతో అశాంతికి ప్రయత్నమా?

(మొదటి పేజీ తరువాయి)

సర్వేల్లో తప్పులు చేసి బీసీ జనాభాను తక్కువగా చూపించే ప్రయత్నాలు జరిగాయన్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలకు 50 సీట్లు రిజర్వ్ చేసినప్పటికీ అందులో 31 మంది నాన్-బీసీలు గెలవడం బీసీలకు తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. బీసీల మెడలు కోసి మజ్లిస్ చేతుల్లో వేస్తే న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్ చెప్పినట్టే నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ మోడల్ అన్నదే బీసీ సామాజిక వర్గాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్ల పేరుతో దేశంలో అశాంతిని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.బీజేపీ, మోదీపై విమర్శలు చేయడం ద్వారా ప్రజల దృష్టిని తమ వైఫల్యాలనుంచి మళ్లించే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్‌పై ఆరోపించారు. మోదీని టార్గెట్ చేయడం వ్యర్థమైన చర్యలుగా అభివర్ణించారు. "మోదీకి సవాల్ విసరడం అంటే సూర్యుడిపై ఉమ్మేయడమే. అది తిరిగి మీ మీదే పడుతుంది," అని హెచ్చరించారు.తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడంపై ఇప్పటికే తీవ్ర నిరాశకు గురవుతున్నారని, బీసీలకు న్యాయం చేసే ప్రసక్తే లేదని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ఎన్నికల కమిషన్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషించాం.మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ, తప్పుడు చిరునామా, 10,452 బల్క్ లేదా సింగిల్ అడ్రస్ ఓటర్లు, 4,132 తప్పుడు ఫోటోలు ఉన్న ఓటర్లు, మరో 33,692 ఓటర్లు ఫారం-6 దుర్వినియోగం చేసినవి ఉన్నాయి మహదేవపురలో మొత్తం1,00,250 ఓట్లు దొంగిలించబడ్డాయి" అని వివరించారు.

"ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా ఓట్లను దొంగిలిస్తున్నారు. కచ్చితంగా ఎన్నికల కమిషన్ దోషి. ఈసీ విశ్వసనీయతపై అనేక సందేహాలు ఉన్నాయి. దానికి సంబంధించిన అనేక ఆధారాలు మా వద్ద ఉన్నాయి" అని రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. బీజేపీ ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితా అంశాలపై ఈసి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చారని, ఇది చాలా ఆందోళనకరమైన విషయమన్నారు. సాయంత్రం 5 గంటల తరువాత ఓటర్ల సంఖ్య పెరగడం కూడా ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాలను సేకరించేందుకు ఆరు నెలల సమయం పట్టిందన్నారు.

# రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబియా పట్టుకుంది

(మొదటి పేజీ తరువాయి)

ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉన్నంతకాలం గులాబీ కండువా ఉంటుందని, కాంగ్రెస్ బిజెపి పార్టీలను మట్టికరిపించి మల్లొకసారి కేసీఆర్ ని ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని అన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరిట రేవంత్ రెడ్డి, ఆయన మంత్రి వర్గం, ఎమ్మెల్యేలందరూ నిన్న ఢిల్లీకి పోయారు. ఒక ముఖ్యమంత్రి, దమ్మున్న నాయకుడు ఢిల్లీకి పోతే.. ఏం చెప్పలా.. బీసీ రిజర్వేషన్ల విషయంలో పోతున్న.. నేను రిజర్వేషన్లు తీసుకుని వస్తా అని చెప్పాలి. కేసీఆర్ ఆనాడు ఎట్ల చెప్పిండు.. నేను ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీకి పోతున్న. తిరిగి తెలంగాణలోనే కాలు పెడుతా అని అన్నడు. తెచ్చిండా..? లేదా..? అది దమ్మున్న నాయకుడు చేసే పని. మరి రేవంత్ రెడ్డి ఏమన్నడు. అది చేస్తా ఇది చేస్తా అని పోయిండు. ఇక అక్కడ ఒకరికి మించి ఒకరు ఉపన్యాసాలు ఇచ్చి మైకులను పగులగొట్టిర్రు. ఓ ఎమ్మెల్యే మాట్లాడుతూ మోదీని వంగపెట్టి గుద్దితేనే రిజర్వేషన్లు వస్తాయని అంటడు. ఈ గుద్దుడు తన్నుడు ఏంది.. ఈ పనికి ఢిల్లీకి పోతారా..? ఎవరన్నా..? పోయి ఏం సాధించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మీరే చెప్తిరి. అది కూడా ఎన్నికల్లో కాదు.. విద్యా, ఉద్యోగ, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ అమలు చేయడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే రిజర్వేషన్లు ఇస్తాని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పలేదు కదా..? ఆ రోజేమో ఓట్ల కోసం బీసీలను మభ్య పెట్టావు. బీసీ సబ్ ప్లాన్ తెస్తా. చట్టబద్ధత తీసుకువస్తా అని చెప్పినవ్ మరి ఎందుకు చేయలేదు. ఇది నీ చేతుల పనే కదా..? రిజర్వేషన్లు అంటే ఢిల్లీ చేతుల ఉంది. బీసీల బడ్జెట్ ఎక్కడ పోయింది. బీసీలకు కాంట్రాక్టులు వచ్చాయా.. అసెంబ్లీ పెట్టి బీసీ సబ్ ప్లాన్ పాస్ చేయొచ్చు కదా..? ఇవన్నీ నీ చేతుల్నే ఉన్నాయి కదా..? ఇవన్నీ ఇవ్వకుండా ఢిల్లీకి పోయి రిజర్వేషన్లు సాధిస్తా అని పోయిండు. కూట్లే రాయి తీయలేనోడు ఏట్ల రాయి తీస్తా అని పోయిండట. అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..? ఇంత విచిత్రమైన మనిషి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

## గాలిలో ఆగిపోయిన గల్ఫ్ కార్మికుని గుండె..

**బలగం టీవి, హైదరాబాద్**



కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీరాముల శ్రీధర్ గత కొన్నేళ్లుగా గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాలో ఫ్రీలాన్స్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం 1:00 గంటల సమయంలో దమామ్ నుండి హైదరాబాద్‌కు బయలుదేరగా, ప్రయాణ మధ్యలోనే గుండెపోటు వచ్చింది. దాంతో విమానంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న విమాన సిబ్బంది వెంటనే విమానాన్ని ముంబైలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వైద్య సిబ్బంది ఆయనను కాపాడేందుకు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని వైద్యులు అధికారికంగా ప్రకటించారు. శ్రీధర్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ విషాద వార్తతో ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.



## ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

**బలగం టీవి, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని ఎస్సి అంగన్ వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్ వాడి టీచర్ మీసాల హంసలీల మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని అందుకే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.డబ్బా పాలు వాడేవారు కొంచెం జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తల్లులకు, బాలింతలకు, గర్భవతులకు తల్లి పాల విశిష్టత గూర్చి అవగాహణ కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ తో పాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్రవంతి, ఆయా అంజలి మరియి తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**బలగం టీవి, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామపంచాయతీ ఆవరణలో పి.హెచ్.సి మెడికల్ అధికారి డాక్టర్ రేణుప్రియ ఆదేశాల మేరకు గురువారం రోజున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 66 మందిని పరీక్షించి, రక్త పరీక్షలు చేశారు. తర్వాత ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినూత్న, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, ఏఎన్ఎం వినోద, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఏబీవీపీ ఇల్లంతకుంట మండల శాఖ ఆధ్వర్యంలో మండలం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి వక్తగా తాటిపెల్లి మహేష్ గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రక్షాబంధన్ వేడుకలు నిర్వహిస్తామని విద్యార్థుల్లో సోదర భావం, సామాజిక సమరసత ,జాతీయత, స్వదేశీ భావన ,ఆధ్యాత్మిక చింతన మరియు క్రమశిక్షణ పెంపోదించడం , దేశభక్తిని నింపడం, ప్రతి విద్యార్థి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి అని సమాజంలో జరుగుతున్న అసంఘీక శక్తులను ఎదురుకోవాలి అని, ధర్మ మార్గాన్ని ఎంచుకోవాలి , మంచిని చేరదియాలని చెడుకు దూరంగా ఉండాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు అక్కెం నాగరాజు, మంద వంశీకృష్ణ,ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దేవరాజం పాల్గొన్నారు

# విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి శిక్షణ

- **ఉచిత ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవి, తంగళ్ళపల్లి**

ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ. లక్షల విలువైన కార్పొరేట్ స్థాయి శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.సిరిసిల్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల, బద్దెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్, సారంపల్లి లోని ట్రైబల్ వెల్ఫేర్, నేరెళ్ల లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, ముస్తాబాద్లోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ మరియు కళాశాలల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ అకాడమీ ఆన్లైన్ క్లాస్ లను శుక్రవారం కేకే మహేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ విద్య ద్వారానే మార్పుసాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ. లక్షలు విలువ చేసే ఆన్లైన్ శిక్షణ తరగతులు ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. విద్యార్థి పాఠాలు చక్కగా విని నోట్స్ రాసుకోవాలని సూచించారు. రోజు వాటిని మరోసారి చదువుకోవాలని పేర్కొన్నారు. పాఠాల్లో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా వచ్చే టెస్ట్ సిరీస్ ను ప్రాక్టీస్ చేయాలని కలెక్టర్ తెలిపారు. దీంతో ఐఐటీ, జే ఈ ఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢీల్లీ లో విద్యా ర్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన జిల్లాలోని విద్యార్థు లకు కూడా అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థి జీవితంలో10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని వివరించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం

కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సామాజిక సమరసత వేదిక..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్వాతంత్ర్య పోరాటంలో చేనేత పరిశ్రమ పోషించిన కీలక పాత్రను స్మరించుకుంటూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో 11వ జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా జరిగింది. జిల్లాలోని నేతన్న విగ్రహం, ఖాదీ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ మోర శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆగస్టు 7, 1905న బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా స్వదేశీ ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఈ ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో చేనేతను ఒక సాధనంగా నిలిపిందని అన్నారు. స్వదేశీ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ లక్ష్యంతో ప్రారంభమైన ఈ ఉద్యమం ఆగస్టు 7న కలకత్తా టౌన్‌హాల్‌లో పిలుపునివ్వడం జరిగిందని వివరించారు. దీనికి గుర్తుగా 2015లో ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యం చేనేత పరిశ్రమ గురించి ప్రజలలో చైతన్యం కల్పించడం, చేనేత కళాకారులకు సామాజిక, ఆర్థిక సహకారం అందించడమని శ్రీనివాస్ పేర్కొన్నారు. విదేశీ వస్తువులు వద్దు – స్వదేశీయే మనకు ముద్దు అని మళ్ళీ రాబోయే తరానికి ఆవశ్యకం ఏర్పడే పరిస్థితి కనపడుతోందని ఇటీవల అమెరికా భారత్ పై సుంకాలు విధింపుతో తేట తెల్లం అవుతోందని శ్రీనివాస్ అన్నారు. ఇటీవల అమెరికా భారత్‌పై సుంకాలు విధించడం వంటి పరిస్థితులు స్వదేశీ వస్తువుల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా, ఖాదీ భవన్‌లో పలువురు చేనేత కళాకారులు ఆడేపు పోషవ్వ, తేల్ల కనకవ్వ, వెంగళ రవీందర్, గుంటుక్ మధుసూదన్, రిక్కమల్లె కొమురయ్య, మంగళారపు రాజేశం, కళ్యాడపు దేవదాసు మరియు ఖాదీ నిర్వాహకుడు ఆడేపు రమేష్‌లను సామాజిక సమరసత వేదిక నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమంలో మోర శ్రీనివాస్, కోడం రవి, గూడూరి భాస్కర్, నాగుల శ్రీనివాస్, దూడమ్ శ్రీనివాస్, చిమ్మణి ప్రకాష్, మదాసు శ్రీనివాస్, గుడ్ల విష్ణు, గుజ్జే శివరామ్, గాజుల వేణు, దాసరి శ్రీనివాస్, పోతు శ్రీనివాస్, నవీన్ యాదవ్, సుంచు ప్రకాశ్, బూట్ల మోహన్, సురేష్, వైశాలి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తుల ఆహ్వానం..

- **ప్రిన్సిపాల్ రఘునాథ్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ మరియు 6 తరగతి నుండి పదవ తరగతి వరుకు గల ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కొరకు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకొని, ప్రవేశము పొందగలరని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ రఘునాథ్ మాట్లాడుతూ.. తేదీ 11/08/2025 నుండి 15/08/2025 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగునని 9వ, 10వ తరగతి మరియు ఇంటర్ తరగతులలో ప్రవేశం కోరే అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి కలదని, ఫిజిక్స్ వల్లహ్ కాన్ అకాడమీ మరియు అంకడెమి వారి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఐఐటీ, నీట్, క్లాట్ మరియు ఇతర పోటీపరీక్షలకు ఐ.ఎఫ్.పి బోర్డు, ప్రొజెక్టర్ మరియు కె యన్ ల ద్వారా 6వ, 7వ,8వ,9వ, 10వ తరగతుల మరియు ఇంటర్ విద్యార్థులకు ఉచిత ఆన్లైన్ క్లాస్సెస్ నిర్వహించబడును. గర్ల్స్ హాస్టల్ లో కూడా ఐ.ఎఫ్.పి బోర్డ్ ద్వారా ఆన్లైన్ క్లాస్సెస్ నిర్వహించబడునని అన్నారు. 2025-2026వ విద్యాసంవత్సరంకు గాను ఐఐఐటి బాసరలో ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

# "ఓం నమో భగవతే వాసుదేవాయ" పాట విడుదల

- మహావతార్ నరసింహా సినిమా నుంచి..
- ప్రేక్షకులను భక్తి లోకంలో ముంచెత్తే మ్యూజికల్ మేజిక్

బలగం టీవీ, హైదరాబాద్

హెూంబలే ఫిలిమ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన యానిమేషన్ ఎపిక్ మహావతార్ నరసింహ తాజాగా మరో భారీ అప్‌డేట్‌తో సందడి చేస్తోంది. రెండు వారాల క్రితం థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోన్న ఈ చిత్రం, విడుదలైనప్పటి నుంచి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తూ రికార్డులను తిరగరాస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి చిత్రబృందం నుంచి ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన కానుకగా "ఓం నమో భగవతే వాసుదేవాయ" పాటను విడుదల చేశారు. ఈ పాట ఇప్పటికే భక్తుల్లో విశేష ఆదరణను పొందుతోంది. మానసికంగా శాంతిని కోరే వారికి ఈ గీతం భక్తిసాన్నిధ్యం




కలిగించేలా ఉంటుంది.

ఈ పాటకు శ్యామ్ సీఎస్ నేపథ్య సంగీతం అందించగా, సాహిత్యాన్ని సౌరభ్ మిట్టల్, ట్వింకిల్ మిట్టల్, రాకేందు మౌళి అందించారు. విజయ్ ప్రకాష్ ఆలపనతో ఈ గీతం మరింత ఆధ్యాత్మిక ఛాయలు సంతరించుకుంది. ఇప్పటికే పుష్ప 2 చిత్రానికి బ్యాగ్రౌండ్ స్కోర్ అందించిన శ్యామ్, ఈ సినిమాతో మరోసారి తన మ్యూజికల్ ప్రతిభను చాటుకున్నారు.

ఇప్పటికే కేజీఎఫ్, కాంతారా, సలార్ వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించిన హెూంబలే సంస్థ, ఇప్పుడు మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌ను ప్రారంభించి ప్రేక్షకుల్లో విభిన్న అనుభూతులను రేకెత్తిస్తోంది. ఈ సినిమా మహావతార్ నరసింహ ప్రబలమైన రూపాన్ని చూపించడంలో విజయం సాధించగా, తాజాగా విడుదలైన పాట ఆధ్యాత్మికతను మరింతగా పెంచుతోంది.

## 'స్పిరిట్' క్యాస్టింగ్ కాల్

బలగం టీవీ, హైదరాబాద్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం స్పిరిట్'. భారీ అంచనాల నడుమ రూపొందనున్న ఈ యాక్షన్ డ్రామా చిత్రాన్ని టీ సిరీస్, భద్రకాళీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దాదాపు రూ.300 కోట్ల బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సెప్టెంబర్ చివరిలో షఉటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా యూనిట్ ఓ సాలిడ్ అప్‌డేట్‌ను విడుదల చేసింది.

స్పిరిట్ సినిమాతో నటన రంగంలోకి ప్రవేశించాలనుకునే యువకుల కోసం చిత్రబృందం డిజిటల్ ఆడిషన్ అవకాశం కల్పించింది. భద్రకాళి పిక్చర్స్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం:

వయస్సు: 13 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్న పురుష నటులు (Male Actors) మాత్రమే అర్హులు.

పాత్రకు తగ్గట్టుగా జుట్టు కత్తిరించేందుకు సిద్ధంగా ఉండాలి.

అప్లికేషన్‌కు పంపవలసినవి:

హెడ్ షాట్ ఫోటో

పర్సనల్ షాట్ ఫోటో

ఇంట్రడక్షన్ వీడియో (పేరు, వ్యక్తిగత వివరాలు, విద్యార్హత వివరాలు తప్పనిసరిగా ఉండాలి)

ఈ వివరాలను పంపవలసిన ఇమెయిల్: spirit.bhadrakalipictures@gmail.com

ఇక మీ అదృష్టాన్ని పరీక్షించుకునే సమయం

ఇండియా మొత్తంలో ఈ స్థాయి అవకాశాలు అరుదు. ప్రభాస్‌తో కలిసి నటించే ఛాన్స్ మీకిదే కావొచ్చు. నటనపై అభిరుచి ఉన్నవారు ఆలస్యం చేయకుండా వెంటనే వీడియో పంపించండి.

## 'కూలీ'కి ఏ సర్టిఫికెట్

బలగం టీవీ, హైదరాబాద్

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ' విడుదలకు ముస్తాబవుతోంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్ కార్యక్రమాల్లో మేకర్స్ వేగం పెంచారు. ఈ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) నుండి 'ఏ' సర్టిఫికేట్ మంజూరైంది. గత రెండు దశాబ్దాల్లో ఏ సర్టిఫికేట్ పొందిన రజినీకాంత్ చిత్రం ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో యాక్షన్, గోల్డ్ అక్రమ రవాణా వంటి అంశాలుండనున్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదలైన వివరాల ప్రకారం, ఈ చిత్రం రన్‌టైం 170 నిమిషాలు (అంటే 2 గంటల 50 నిమిషాలు)గా ఉండనుంది. ఈ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు సత్యరాజ్, మహేంద్రన్, అక్కినేని నాగార్జున, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం, నేపథ్య సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు.

# పవర్ లిఫ్టింగ్‌లోనూ సత్తా చాటిన ప్రగతి





బలగం టీవీ, హైదరాబాద్

నటనలో తళుక్కున మెరిసే కళాకారులు చాలామంది ఉన్నా.. ఇతర రంగాల్లోనూ ప్రతిభ చూపించేవారు అరుదు. అలాంటి అసాధారణ ప్రతిభాశాలి సినీ నటీమణి ప్రగతి. తల్లి, అక్క, వదిన పాత్రలతో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో 100కి పైగా చిత్రాల్లో ఆమె తనదైన ముద్ర వేసింది. కామెడీ టైమింగ్, ఎమోషనల్ సీన్లలో ఆమె వేసే హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రారంభంలో హీరోయిన్‌గా పెద్దగా పేరు తెచ్చుకోలేకపోయినా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా విశేషంగా రాణించిన ప్రగతి.. ఇప్పుడు పవర్ లిఫ్టింగ్‌లోనూ అదరగొడుతోంది. ఒంగోలు నుంచి మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆమె, తమిళ దర్శకుడు భాగ్యరాజ్ రూపొందించిన 'వీట్ల విశేషంగ' చిత్రంతో వెండితెరలోకి ప్రవేశించింది. పెళ్లి తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకొని, టీవీ సీరియల్స్ ద్వారా తిరిగి రంగప్రవేశం చేసింది.

ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. 50 ఏళ్ల వయస్సులోనూ స్టైలిష్ లుక్‌కి ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోంది. 2020 లాక్‌డౌన్ సమయంలో ఆమె డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, అది కేవలం హాబీకి పరిమితం కాకుండా పవర్ లిఫ్టింగ్ అనే క్రీడలో ప్రొఫెషనల్‌గా రాణించేందుకు దారి తీసింది.


తాజాగా ప్రగతి, 2024 సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్, అలాగే ఇటీవల కేరళలో జరిగిన నేషనల్ మాస్టర్స్ క్లాసిక్ ఛాంపియన్‌షిప్‌లో ఒక గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించింది. స్క్వాట్ విభాగంలో 115 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 50 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 122.5 కిలోలు లిఫ్ట్ చేయడం గమనార్హం. ఈ అరుదైన విజయంపై సినీ ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. ఒకవైపు సినీ రంగంలో.. మరోవైపు క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచిన ప్రగతి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# చనుబాలు దానం చేసిన గుత్తా జ్వాల

- సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం

బలగం టీవీ, హైదరాబాద్

మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాలా తన మాతృత్వాన్ని సమాజానికి స్ఫూర్తిగా మార్చారు. ఆమె చేసిన 6.7 లీటర్ల చనుబాల దానానికి నెటిజన్లు శభాష్ అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈ ఆధునిక యుగంలో కొందరు మహిళలు శరీర ఆకృతి మారిపోతుందన్న భ్రమతో పిల్లల పుట్టించడానికే అయిష్టత చూపుతుంటే.. గుత్తా జ్వాల చేసిన ఈ పని విశేషంగా గుర్తింపు పొందుతోంది.




ఆమె హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్‌కు అనుబంధంగా పనిచేస్తున్న మిల్క్ బ్యాంక్ ద్వారా ఈ చనుబాలాన్ని దానం చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న నవజాత శిశువులకు ఈ పాలు ఉపయోగపడనున్నాయి. చనుబాల దానం ఇప్పటికీ టబుగా భావించే సమాజంలో ఆమె ముందుకు రావడం గర్వకారణమని, ఇతర సెలబ్రిటీలు కూడా గుత్తా జ్వాలను అనుసరించాలని నెటిజన్లు సూచిస్తున్నారు. చనుబాల దానం గురించి ఉన్న అపోహల్ని కూడా ఆమె చొరవతో కొంతవరకు తొలగించినట్టయిందని అభిప్రాయపడుతున్నారు. "అందం పోతుందనే అపార్థాలతో మాతృత్వాన్ని వెనక్కి నెట్టడం విడదీయదగ్గ విషయం" అని పలువురు వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో గుత్తా జ్వాల, తమిళ నటుడు విష్ణు విశాల్ దంపతులకు కూతురు జన్మించింది. విష్ణు విశాల్ సోదరి సంగీత వేడుకలో మొదటిసారి జ్వాలా పరిచయమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మొదలైన పరిచయం ప్రేమగా మారి, చివరికి వివాహబంధంగా మారింది. గుత్తా జ్వాల గతంలో సహచర బ్యాడ్మింటన్ ఆటగాడు చేతన్ ఆనంద్‌తో 2005లో వివాహం చేసుకొని 2011లో విడాకులు తీసుకున్నారు. అదే తరహాలో విష్ణు విశాల్ కూడా కాస్ట్యూమ్ డిజైనర్ రజనీ నటరాజ్‌తో విడిపోయారు.




## చెన్నై మాస్టర్స్‌లో అర్జున్ శుభారంభం

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్టాత్మక చెన్నై మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ యువ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఐదో ర్యాంకర్ అర్జున్ ఇరిగేసి విజయం సాధించాడు. గురువారం ప్రారంభమైన ఈ టోర్నీలో ఫేవరైట్‌గా బరిలోకి దిగిన అర్జున్.. తొలి రౌండ్‌లో అమెరికా ఆటగాడు అవాండర్ లియాంగ్‌పై ఆధిపత్యంతో గెలిచాడు. తొమ్మిది రౌండ్ల క్లాసికల్ ఫార్మాట్‌లో సాగనున్న ఈ టోర్నీలో అర్జున్ ఆరంభ నుంచే చురుగ్గా ఆడి, ప్రత్యర్థికి ఎలాంటి అవకాశాలూ ఇవ్వలేదు. ఇక చెన్నైకు చెందిన గ్రాండ్ మాస్టర్లు ప్రణవ్, కార్తీకేయన్ మధ్య జరిగిన గేమ్ హెూరాహెూరీగా సాగి చివరికి డ్రాగా ముగిసింది. భారత్‌కు చెందిన మరో స్టార్ ప్లేయర్ నిహాల్.. జర్మనీ ఆటగాడు విన్సెంట్ కేమర్ చేతిలో ఓటమిపాలయ్యాడు. విదిత్ గుజరాతీ తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. చాలెంజర్స్ విభాగంలో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వైశాలి తొలి గేమ్‌ను డ్రా చేసుకోగా, హారిక ఓటమి చవిచూసింది. టోర్నీలో రెండో రౌండ్ శుక్రవారం జరగనుంది.

## ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ సెమీస్‌కు మరో ఐదుగురు

బలగం టీవీ, హైదరాబాద్



ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత బాక్సర్లు మెరుగైన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ఐదుగురు యువ బాక్సర్లు ప్రత్యర్థులపై విజయం సాధించి సెమీఫైనల్స్ చేరారు. దీంతో వీరంతా కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. పురుషుల విభాగంలో శివమ్ (55 కిలోలు), మౌసమ్ సుహాగ్ (65 కిలోలు), రాహుల్ (75 కిలోలు), గౌరవ్ (85 కిలోలు), హేమంత్ (90 కిలోలు) తమ తమ విభాగాల్లో ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీస్ బెర్త్ దక్కించుకున్నారు.

ఇదిలా ఉండగా, అండర్-22 విభాగంలో భారత్ ఇప్పటికే 13 పతకాలు ఖాయం చేసుకుంది. అలాగే 19 ఏళ్ల కేటగిరీలోనూ 12 మెడల్స్ ఖరారయ్యాయి. టోర్నీలో భారత్ పతకాల దిశగా చకచకా ముందుకు సాగుతోంది.